

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 2,212 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1,376 క్యూసెక్కులు విడుదలయ్యాయి.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 41.5853 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 2,200 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నాయి. దిగువకు 2,200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

నేడు ముస్లిం మైనార్టీ ముఖ్యనాయకుల సమావేశం

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం ముస్లిం మైనార్టీ ముఖ్య నాయకుల సమావేశం తాడేపల్లిలోని శుభమస్తు కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ వి.ఖాదర్‌బాషా తెలిపారు. ఆయన ఈ సమావేశం ఏర్పాట్లను పరిశీలించేందుకు బుధవారం తాడేపల్లి చేరుకున్నారు. సభావేదిక, బయట భద్రత ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం నాయకులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తిచేయాలి

గృహ నిర్మాణ సంస్థ స్పెషల్ సెక్రటరీ దివాన్ మైడెన్



తెనాలిటౌన్: జగనన్న లేఅవుట్లలో నిర్మాణంలో ఇళ్ల పనులు వేగవంతంగా జరగాలని గృహ నిర్మాణ సంస్థ స్పెషల్ సెక్రటరీ బీఎం దీవాన్ మైడెన్ అధికారులను ఆదేశించారు. కొలకలూరు గ్రామంలోని జగనన్న లేఅవుట్‌ను బుధవారం ఆయన సందర్శించారు. నీటి సౌకర్యం లేదని, పూర్తయిన గృహాలకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వాలని లబ్ధిదారులు అధికారులను కోరారు. సమస్యలను పరిష్కరించాలని స్పెషల్ సెక్రటరీ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట హౌసింగ్ పీడీ సాయినాథ్‌కుమార్, డీఈ రఫీ, ఏఈ శ్రీనివాస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఫణీంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లకు సత్కారం



పాత గుంటూరు: ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లకు నగదు పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు. జిల్లా రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు సభ గుంటూరు -2 డిపో గ్యారేజీలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఆదాం సాహెబ్, అసిస్టెంట్ డైరెక్టర్ శోభా మంజరి, జిల్లా ప్రజా రవాణా అధికారి జి.విజయగీత పాల్గొన్నారు. జిల్లాలో ఉత్తమ డ్రైవర్‌లుగా 18 మందిని గుర్తించి నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో డెప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ నర్రా శ్రీనివాసరావు, డిపోల మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి యార్డులో రైతులకు ఉచిత భోజనం

మిర్చి యార్డు చైర్మన్ ఏసురత్నం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో ఈ నెల 6వ తేదీ నుంచి రైతులకు ఉచిత భోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం చెప్పారు. మిర్చి యార్డులో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత భోజనానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందని తెలిపారు. గత ఏడాది మిర్చి సీజన్‌లో రూ.8,500 కోట్ల వ్యాపారం చేయడం జరిగిందని, యార్డు పాలకవర్గం, అధికారుల సమన్వయంతో ఈ ఏడాది రూ.10 వేల కోట్ల వ్యాపారం చేసే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. యార్డుకు ప్రస్తుతం రోజుకు లక్షకు పైగా మిర్చి బస్తాలు వస్తున్నాయని, రెండు లక్షల బస్తాలు వచ్చినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. సమావేశంలో యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, అధికారులు శ్రీకాంత్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,500, గరిష్ట ధర రూ.3,400, మోడల్ ధర రూ.3,000 వరకు పలికింది.



చిలకలూరిపేటలో పింఛన్ పంపిణీ చేస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

వీధివీధిలో పింఛన్ల పండుగ

నెహ్రూనగర్(గుంటూరు): ఒకటో తేదీ వీధి వీధిలో పింఛన్ల పండుగ నెలకొంది. వైఎస్సార్ పెన్షన్ కానుకను గుంటూరు జిల్లాలో మొదటి రోజు 77.9 శాతం పంపిణీ పూర్తయింది. 2,53,754 మంది లబ్ధిదారులు ఉండగా ప్రభుత్వం రూ.69.68 కోట్లు కేటాయించింది. బుధవారం సాయంత్రానికి 1,97,671 మంది లబ్ధిదారులకు రూ.54.32 కోట్లు అందజేశారు.

8,983 మందికి పింఛన్ల పంపిణీ

నరసరావుపేట: పురపాలక సంఘం పరిధిలో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్‌లు అందజేశారు. 33 సచివాలయాల పరిధిలో 11,075 మంది లబ్ధిదారులు ఉండగా 8,983 మందికి (81.11 శాతం) అందజేశారు.

ఎస్‌పీఎల్ విజేత ఎస్‌కేబీఆర్‌టీ

- రన్నర్‌గా విజ్ఞాన్ డిగ్రీ కళాశాల
- జూనియర్స్ విభాగంలో విజేతగా కళ్లం హరనాథ్‌రెడ్డి కళాశాల జట్టు
- రన్నర్‌గా జీవీఆర్ అండ్ ఎస్ ఇంజినీరింగ్ కళాశాల
- విన్నర్, రన్నర్ జట్లకు ట్రోఫీలు అందజేత

ప్రత్తిపాడు: సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) విజేతగా సీనియర్స్ విభాగంలో ఎస్‌కేబీఆర్‌టీ డిగ్రీ కళాశాల జట్టు నిలిచింది. జూనియర్స్ విభాగంలో కళ్లం హరనాథ్‌రెడ్డి కళాశాల జట్టు విజయం సాధించింది. ఏపీ, తెలంగాణల్లోని ఔత్సాహిక క్రికెటర్లను ప్రోత్సహించేందుకు సాక్షి మీడియా గ్రూపు గత నెల 25 నుంచి నిర్వహిస్తున్న సాక్షి క్రికెట్ ప్రీమియర్ లీగ్ బుధవారంతో ముగిసింది. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ కళాశాలలో జరిగిన ప్రీమియర్ లీగ్‌కు స్పాన్సర్లుగా ఏపీఎండీసీ, వివా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వ్యవహరించాయి. ఆఖరి రోజు సెమీ ఫైనల్స్‌లో ఒక మ్యాచ్, సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. మొత్తం ఆరు జట్లు పోటీల్లో పాల్గొన్నాయి.

Regional sponsor

District sponsor



సీనియర్ విన్నర్ ఎస్‌కేబీఆర్‌టీ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జేసీ రాజకుమారి, కిట్స్ కళాశాల సెక్రటరీ కె.శేఖర్



జూనియర్ విన్నర్ కళ్లం కళాశాల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అతిథులు



సీనియర్ రన్నర్ విజ్ఞాన్ డిగ్రీ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జేసీ రాజకుమారి, కిట్స్ కళాశాల సెక్రటరీ కె.శేఖర్



ట్రోఫీ అందుకుంటున్న జూనియర్ రన్నర్ జీవీఆర్‌అండ్‌ఎస్ కళాశాల జట్టు

జీవీఆర్ అండ్ ఎస్ ఘన విజయం..

మొదటి మ్యాచ్ సెమీ ఫైనల్స్ విభాగంలో జీవీఆర్ అండ్ ఎస్ కళాశాల వర్సెస్ చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జీవీఆర్ అండ్ ఎస్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చేబ్రోలు కళాశాల జట్టు నిర్ణీత పది ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 66 పరుగులకే పరిమితమవ్వడంతో జీవీఆర్ అండ్ ఎస్ కళాశాల జట్టు 28 పరుగులతో ఘన విజయం సాధించింది. 26 బంతుల్లో 28 పరుగులు సాధించిన షాలెంరాజ్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

జూనియర్స్ విభాగంలో కళ్లం హరినాథరెడ్డి కళాశాల జట్టు జయభేరి..

సాక్షి ప్రీమియర్ లీగ్ ఫైనల్స్ క్షణ క్షణం ఉత్కంఠగా సాగాయి. జూనియర్స్ విభాగంలో ఫైనల్ మ్యాచ్ కళ్లం హరినాథ్‌రెడ్డి కళాశాల వర్సెస్ జీవీఆర్ అండ్ ఎస్ జట్ల మధ్య జరిగింది. కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ బాబు టాస్ వేశారు. జీవీఆర్ అండ్ ఎస్ కళాశాల జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 70 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కళ్లం హరనాథ్‌రెడ్డి జట్టు కేవలం ఒక్క వికెట్ కోల్పోయి 71 పరుగులు సాధించి, తొమ్మిది వికెట్లతో జయభేరి మోగించింది. రెండు ఓవర్లలో రెండు వికెట్లు తీసి 15 పరుగులు, 10 బంతుల్లో 14 పరుగులు చేసిన బాలాజి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

అదరగొట్టిన ఎస్‌కేబీఆర్‌టీ కళాశాల జట్టు..

సీనియర్స్ విభాగంలో విజ్ఞాన్ డిగ్రీ కళాశాల వర్సెస్ ఎస్‌కేబీఆర్‌టీ డిగ్రీ కళాశాల జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. కిట్స్ కళాశాల సెక్రటరీ కె.శేఖర్ టాస్ వేశారు. ఎస్‌కేబీఆర్‌టీ కళాశాల జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన విజ్ఞాన్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 46 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌కేబీఆర్‌టీ కళాశాల జట్టు కేవలం 3.4 ఓవర్లలోనే ఒక్క వికెట్ కూడా నష్టపోకుండా 48 పరుగులు చేసి 10 వికెట్లతో టోర్నమెంట్ విజేతగా నిలిచింది. 13 బంతుల్లో నాలుగు ఫోర్లు, ఒక సిక్స్‌తో 27 పరుగులు సాధించిన తోఫిక్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

జేసీ చేతుల మీదుగా ట్రోఫీలు అందజేత..

ఎస్‌పీఎల్ ముగింపు కార్యక్రమానికి అతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి హాజరయ్యారు. సీనియర్స్ విభాగంలో విన్నర్, రన్నర్‌లుగా నిలిచిన ఎస్‌కేబీఆర్‌టీ డిగ్రీ కళాశాల జట్టు, విజ్ఞాన్ డిగ్రీ కళాశాల జట్టుకు, జూనియర్స్ విభాగంలో విన్నర్, రన్నర్‌లుగా నిలిచిన కళ్లం హరనాథ్‌రెడ్డి కళాశాల, జీవీఆర్ అండ్ ఎస్ ఇంజినీరింగ్ కళాశాల జట్లకు ట్రోఫీలు, సర్టిఫికెట్లును జేసీ రాజకుమారి అందించారు.



ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కిట్స్ కళాశాల సెక్రటరీ కె.శేఖర్ మాట్లాడుతూ క్రికెట్‌కు వరల్డ్ పాపులారిటీ ఉందన్నారు. క్రీడలను స్పోర్టివ్‌గా తీసుకోవాలని చెప్పారు. ప్రతి ఏటా తమ కళాశాలలో టోర్నమెంట్ నిర్వహిస్తున్న సాక్షికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



జేసీ రాజకుమారి మాట్లాడు తూ క్రికెట్‌ను చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్క రూ చూస్తూ ఆస్వాదిస్తారని చెప్పారు. పోటీల్లో గెలుపోటములు సాధారణమని, క్రీడా స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు.

సాక్షి జిల్లా మేనేజర్ టి.గోపి మాట్లాడుతూ 2019 నుంచి క్రమం తప్పకుండా సాక్షి ప్రీమియర్ లీగ్‌ను సీనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది 44 జట్లు పాల్గొన్నాయని తెలిపారు.



క్రీడాకారుల కేరింత

అభివృద్ధిలో అచ్చెరువు

ఎండిన చెరువులకు రూపం తెచ్చి, గట్టువరకు పొంగిపొర్లే విధంగా గంగను నింపడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాయి. అమృత్ సరోవర్ పథకం కింద చెరువుల ఆధునికీకరణ, సుందరీకరణ పనులు చేపట్టి గ్రామాలను హరిత వనాలుగా, వేసవిలో సైతం నీటి ఎద్దడికి తావులేకుండా చేసే బృహత్తర ప్రణాళికలను అమలు చేస్తున్నాయి. ఈ పథకాన్ని సమర్థంగా అమలు చేస్తున్న బాపట్ల జిల్లా యంత్రాంగం రాష్ట్రంలోనే నాలుగోస్థానంలో జిల్లాను నిలపడం విశేషం.



అభివృద్ధి చేసిన కారంచేడు మండలంలోని స్వర్ణ గ్రామ పంచాయతీలోని చెరువు

- మిషన్ అమృత్ సరోవర్‌లో భాగంగా చెరువుల ఆధునికీకరణ
- జిల్లాలో 152 చెరువులు గుర్తింపు
- 109 చెరువుల పనులు మొదలు
- ఇప్పటికే 43 పనులు పూర్తి
- రాష్ట్రంలో జిల్లాకు నాలుగో స్థానం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో మిషన్ అమృత్ సరోవర్ పథకం పనులు శరవేగంగా సాగుతున్నాయి. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 వసంతాలు పూర్తయిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నాయి. ఈ పథకం ద్వారా గ్రామాల్లో చెరువులను ఆధునికీకరించడంతోపాటు సుందరీకరించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా చెరువుల్లో పూర్తిస్థాయిలో నీటిని నింపి చివరి ఆయకట్టు వరకు అందించడంతో పాటు వేసవిలో పశుపక్ష్యాదులకు నీటి కష్టాలు లేకుండా చేయనున్నారు. మరో వైపు భూగర్భ జలాలు పెంపొందిస్తారు. తద్వారా పరిసరాల్లోని బోరుబావులు నీటిని చిందిస్తాయి. దీంతో వ్యవసాయానికి నీటి కొరత లేకుండా ఉంటుంది.

లక్ష్యం..

అమృత్ సరోవర్ ద్వారా జిల్లావ్యాప్తంగా కనీసం 75 చెరువులను ఆధునికీకరించాలన్నది ప్రభుత్వం లక్ష్యం. అయితే ఇప్పటికే అధికారులు 151 చెరువులను గుర్తించారు. 2022 ఏప్రిల్ 24న పథకం ప్రారంభం కాగా ప్రస్తుతం 109 చెరువు పనులను మొదలు పెట్టారు. ఎకరం విస్తీర్ణంలో 4లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని (పూడిక తీసి)తీసి అందుకు అనుగుణంగా నీటిని నిలువపెట్టనున్నారు.

పనులు ఇలా..

చెరువుల్లో పూడిక తీయడం, చెరువుకు నీటిని అందించే ఫీడర్ చానల్‌ను ఆధునికీకరించడం, ఆయకట్టుకు నీరందించే చెరువు తూములు, గేట్లు, ప్రధాన కాలువలకు మరమ్మతులతో పాటు చెరువుకట్టలు ఆధునికీకరణ, కట్ట సుందరీకరణ పనులు చేయనున్నారు. కాలువకట్ట మరింత గట్టి పడేలా మొక్కలు నాటడం, వాకింగ్ ట్రాక్ తదితర సుందరీకరణ పనులు చేయనున్నారు. రివిట్ మెంట్ పనులు పూర్తి స్థాయిలో చేపట్టనున్నారు.

43 చెరువు పనులు పూర్తి..

జిల్లాలో ఏడాదిలో 75 చెరువు పనులు పూర్తి చేయడం లక్ష్యం కాగా ఇప్పటికే 109 చెరువు పనులు మొదలు పెట్టారు. ఇందులో గడిచిన ఆగస్టు నాటికి పనులు పూర్తి చేసి 10 చెరువులను, జనవరి 26 గణతంత్ర దినోత్సవం నాటికి మరో 33 చెరువుల పనులు పూర్తి చేసి జాతీయ జెండా ఎగురువేసి జాతికి అంకితం చేశారు. మొత్తం 43 చెరువు పనులు పూర్తయ్యాయి. దీంతో బాపట్ల జిల్లాకు రాష్ట్రంలో నాలుగవ స్థానం దక్కింది. వచ్చే ఆగస్టు 15 కు మిగిలిన 32 చెరువులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆదిశగా పనులు సాగుతున్నాయి. డ్వామా విభాగం పనులు పర్యవేక్షిస్తోంది.

మండలం పేరు	గుర్తించిన చెరువులు	పనులు మొదలైనవి	పూర్తి చేసినవి
అద్దంకి	13	11	03
అమర్తలూరు	01	01	0
బల్లికురవ	07	04	3
భట్టిప్రోలు	01	01	0
చెరుకుపల్లి	07	05	01
చినగంజాం	04	03	0
ఇంకొల్లు	09	05	3
జె-పంగులూరు	12	11	4
కారంచేడు	08	07	05
కర్లపాలెం	01	01	00
కొల్లూరు	07	06	0
కొరిశపాడు	08	06	02
మార్టూరు	18	14	07
నిజాంపట్నం	05	04	00
పర్చూరు	14	09	05
పిట్టలవానిపాలెం	01	00	00
రేపల్లె	01	00	00
సంతమాగులూరు	11	04	03
చుండూరు	05	04	00
వేమూరు	05	02	01
యద్దనపూడి	13	11	06
మొత్తం	151	109	43

ఒక్కో చెరువుకు రూ 15లక్షల పైనే ఖర్చు..

అమృత్ సరోవర్ కింద ప్రభుత్వం ఒక్కో చెరువుకు రూ. 15 లక్షల వరకు వెచ్చిస్తోంది. కొన్ని చెరువులకు రూ. 12 లక్షలకు పైగా, మరికొన్ని చెరువులకు రూ. 17 లక్షలకు పైగా వెచ్చిస్తున్నారు. పనులు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టారు. ఆధునికీకరణ పనులకోసం ప్రభుత్వం రూ. 2 లక్షలు అదనంగా చెల్లిస్తుంది. దీంతో పాటు మాఊరు –మాచెరువు కింద దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేస్తే అటువంటి వారి పేరు పెట్టనున్నారు.

చెరువులను ప్రకృతి వనాలుగా మార్చడమే లక్ష్యం



అమృత్ సరోవర్ ద్వారా జిల్లాలో చెరువులను ప్రభుత్వం ఆధునికీకరిస్తోంది. దీంతో చివరి ఆయకట్టుకు నీరందుతుంది. భూగర్భ జలాలు పెరిగి బోరు బావులకు నీరందుతుంది. వేసవిలో పశుపక్ష్యాదులకు సైతం నీటి సౌకర్యం కలుగుతుంది. జిల్లాలో వచ్చే ఆగస్టు నాటికి 75చెరువు పనులు పూర్తి చేయాలన్నది లక్ష్యం. ఇప్పటికి 43చెరువు పనులు పూర్తయ్యాయి. మిగిలిన 32 చెరువు పనులు గడువులోగా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం.

– శంకర్ నాయక్, డ్వామా పీడీ, బాపట్ల

మరణంలోనూ వీడని పేగుబంధం

● కుమారుడికి ఉపాధి చూపించేందుకు వెళుతూ రోడ్డు ప్రమాదంలో తల్లి.. కొడుకు దుర్మరణం ● నల్లగొండ జిల్లాలో బైక్‌ను కారు ఢీకొట్టడంతో దుర్ఘటన

చేతికొచ్చిన కొడుక్కి ఏదైనా ఉద్యోగం దొరికితే కుటుంబానికి కాస్త ఆదరవుగా ఉంటాడని తలంచిందా పేద తల్లి.. సొంతూరిలోనే ఉపాధికి మార్గం దొరకడంతో ఎంతో సంతోషించింది.. తమ కష్టాలు కడతేరుతాయనే ఆనందం కంటే తమ గారాలపట్టి ప్రయోజకుడవుతాడనే ఆలోచనే ఆమెను పరవశింపజేసింది. తానే స్వయంగా వెంటబెట్టుకుని పనిలో చేర్పించి, కుమారుడి ప్రయోజకత్వాన్ని చూసి మురిసిపోవాలనుకుంది. అయితే ఆ తల్లి ఆశలను, ఆ కుమారుడిని భవిష్యత్తును ఓ ప్రమాదం చిదిమేసింది.. ఆ తల్లీకుమారుల బంధం మరణంలోనూ వీడని అనుబంధమై నిలిచింది.





ఘటనాస్థలిలో దెబ్బతిన్న కారు, దగ్ధమైన బైక్, తల్లి వెంకాయమ్మకు మిఠాయి తినిపిస్తున్న గణేష్ (ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి: ఎదిగిన కుమారుడికి సొంతూరిలో ఉపాధి చూపించేందుకు తీసుకెళ్తున్న తల్లికి మార్గమధ్యలో అనుకోని ఆపద ఎదురైంది. టవేరా రూపంలో మృత్యువు తల్లితో పాటు కుమారుడిని కూడా కబళించింది. నల్లగొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి మండల పరిధిలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ విషాదకర ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం కొప్పరం మండలం సంతమావులూరు గ్రామానికి చెందిన గుంజి ఎలమంద, వెంకాయమ్మ(37) దంపతులు 20 ఏళ్ల క్రితం దేవరకొండ మండలం తాటికోలు గ్రామానికి వలస వచ్చారు. వీరికి కుమారుడు గణేశ్ (19), కుమార్తె ఉన్నారు. దంపతులిద్దరూ భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

సొంతూరికి వెళ్తూ..

ఇంటర్మీడియెట్ వరకు చదువుకుని మధ్యలో చదువు ఆపేసిన కుమారుడు గణేశ్‌కు ఏదైనా దారి చూపించాలని కొంతకాలంగా తల్లిదండ్రులు అనుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే సొంతూరులోని ఓ ఎరువుల దుకాణంలో పనిచేసే అవకాశం గణేశ్‌కు రావడంతో తల్లి వెంకాయమ్మ అతడిని అక్కడికి తీసుకెళ్లాలని అనుకుంది. అందులో భాగంగానే తెల్లవారుజామున 5గంటలకు బైక్‌పై తాటికోల్ నుంచి గణేశ్, వెంకాయమ్మ సంతమావులూరుకు బయలుదేరారు. మార్గమధ్యలో పెద్దఅడిశర్లపల్లి మండలం చిల్కమర్రి స్టేజీ సమీపంలోని కోదాడ-జడ్చర్ల 167వ జాతీయ రహదారిపైకి రాగానే ఎదురుగా వేగంగా వస్తున్న టవేరా వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న తల్లి, కుమారులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మతిచెందారు. ప్రమాదం జరిగిన తర్వాత టవేరా వాహనం బైక్‌ను కొంత దూరం ఈడ్చుకెళ్లడంతో మంటలు చెలరేగి దగ్ధమైంది. సమాచారం మేరకు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి అతివేగం, నిద్ర మత్తు కారణం కావచ్చని భావిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. విచారణ అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను దేవరకొండ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త ఎలమంద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ నిధులు దుర్వినియోగమైతే చర్యలు

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



ఆడిట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల: జిల్లాలో ప్రభుత్వ నిధులు సద్వినియోగం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులకు సూచించారు. బుధవారం బాపట్ల కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా ఆడిట్ అధికారి నూతన కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్థానిక సంస్థలకు మంజూరు చేసిన నిధులను దుర్వినియోగం కాకుండా చూడాలని సూచించారు. తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆడిట్ శాఖ సంచాలకులు ఆర్.హరిప్రకాష్, జిల్లా ఆడిట్ ఆఫీసర్ పద్మజ, ఆడిట్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భట్టిప్రోలును సందర్శించిన ముంబై విద్యార్థులు

బౌద్ధ స్తూపం వద్ద ప్రార్థనలు


భట్టిప్రోలు బౌద్ధ స్తూపం వద్ద ప్రార్థనలు చేస్తున్న ముంబై యూనివర్సిటీ విద్యార్థులు

భట్టిప్రోలు: స్థానిక బౌద్ధ స్తూపాన్ని ముంబై యూనివర్సిటీ విద్యార్థులు బుధవారం సందర్శించారు. దేశంలోని బౌద్ధ మత ఆనవాళ్లపై అధ్యయనంలో భాగంగా ఆ విశ్వ విద్యాలయంలో పురావస్తు శాస్త్రంలో గౌతమబుద్ధ చరిత్రను పరిశోధిస్తున్న 300 మంది విద్యార్థుల్లో 103 మంది ఇక్కడికి రెండు ప్రత్యేక బస్సుల్లో విచ్చేశారు. వీరు వయో పరిమితితో సంబంధం లేకుండా ఈ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేస్తున్నారు. స్తూపం చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజలు నిర్వహించి అందరూ సామూహికంగా ప్రార్థనలు చేశారు.

విలువైనది చారిత్రక సంపద



చారిత్రక సంపద చాలా విలువైనది. అతి ప్రాచీనమైన భట్టిప్రోలు బౌద్ధ స్తూపాన్ని పర్యాటక ప్రాంతంగా మార్చాలి. భావితరాలు తెలుసు కోవాల్సిన చరిత్ర స్మారక కట్టడాలను పరిరక్షించుకోవాలి. ఈ స్తూపాన్ని పర్యాటకులు సందర్శించే విధంగా తీర్చిదిద్దాలి.

–డాక్టర్ యోజనా భగత్
పురావస్తు శాస్త్ర ఆచార్యులు
(హెచ్‌వోడీ)

మౌలిక వసతులు కల్పించాలి



బౌద్ధస్తూపం ఆవరణలో కనీస మౌలిక వసతులు లేవు. కూర్చునేందుకు బల్లలు లేవు. కింద గడ్డిలో కూర్చోవాలంటే పురుగు, పుట్ర ఉంటాయి. కనీసం తాగేందుకు నీటి సదుపాయం కూడా లేదు. పర్యాటకుల కోసం కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలి

–వీరేంద్ర పాల్, బుద్దిస్ట్ స్టడీస్
విద్యార్థి (ముంబై
విశ్వ విద్యాలయం)

చరిత్ర తెలుసుకునేందుకు వచ్చాం



భట్టిప్రోలు బౌద్ధ స్తూపం చరిత్రను గూర్చి తెలుసుకుని ఇక్కడికి వచ్చాం. ఇప్పటి వరకు నాగార్జునసాగర్, నాగార్జున కొండ, ఫణిగిరి, ప్రస్తుతం భట్టిప్రోలు, అమరావతి సందర్శించి గుంటుపల్లి, జగ్గయ్యపేట బౌద్ధక్షేత్రాలు తిలకించి శుక్రవారం తిరిగి వెళతాం. ఇక్కడి వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది.

–గమ్రే రూపేష్, కో–ఆర్డినేటర్

ప్రణాళికాబద్ధంగా సాగితేనే లక్ష్యసాధన

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్


స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల టౌన్: ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతేనే లక్ష్యాన్ని సాధించగలుగుతామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. శ్రీభావపురి విద్యసంస్థలు ఆధ్వర్యంలో తయారు చేసిన ఎస్సై, కానిస్టేబుళ్ల పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను ఎస్పీ చేతుల మీదుగా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భావపురి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్ పోటీ పరీక్షలు రాసే వారికి కోసం ఉచితంగా మెటీరియల్ ఇవ్వటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

పోటీలో మనం విజయం సాధించాలంటే సరైన శిక్షణ ఉండాలన్నారు. జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ ఎస్సై పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు శిక్షణ తరగతులకు వెళ్లి రావడానికి శాఖా పరంగా కొంత వెసులుబాటు కల్పిస్తున్నామన్నారు. దానిని అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని ఎస్సై ఉద్యోగాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో శ్రీ భావపురి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆవుల వెంకటేశ్వర్లు, డి. చిన్న భూషణం, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఎ. శ్రీనివాస్ పాల్గొన్నారు.

శింగరకొండ ఆంజనేయునికి రూ. 36.81 లక్షల ఆదాయం

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో భక్తులు వేసిన కానుకల హుండీని దేవదాయశాఖ అధికారుల సమక్షంలో బుధవారం దేవస్థాన ఆవరణలో లెక్కించారు. 98 రోజులకు గాను రూ. 36,81,763 నగదు, 44.780 గ్రాముల బంగారం, 304 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ యూఎస్ఏ 6 డాలర్లు, కెనడా డాలర్స్ 30, మలేషియా 51 సైట్స్ ఒక కువైట్ దినార్, హఫ్‌రియాల్–ఓమెన్ 14000 చిల్లీస్ యుగండా వచ్చినట్లు దేవాలయ అధికారు లు తెలిపారు.

కానుకల హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ పరిశీలకులు పి.శైలేంద్ర కుమార్, సహాయ కమిషనర్ టి. సుభద్ర, పర్యవేక్షించారు. దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోట శ్రీనివాసకుమార్, సభ్యులు జమ్మలమడక రమాదేవి హనుమంతరావు, దేవస్థాన అర్చకులు పాల్గొన్నారు.

పార్టీకి ద్రోహం చేస్తే ప్రజలు క్షమించరు


ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల: పార్టీకి ద్రోహం చేస్తే ప్రజలు సహించరని రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బుధవారం రాత్రి తన నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి రెండుసార్లు ఎమ్మెల్యే సీటు ఇచ్చి ఎమ్మెల్యేను చేస్తే ఆ పార్టీకే ద్రోహం చేసేలా మాట్లాడడం సరికాదన్నారు. ఆదరించిన పార్టీనే విమర్శించడం ఏమిటని ప్రశ్నించారు. చంద్రబాబు కుట్ర రాజకీయాల్లో భాగంగానే కీలుబొమ్మగా మారి చేస్తున్న వ్యాఖ్యలు ప్రజలు నమ్మరన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఆయనకు సరైన బుద్ధి చెబుతారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఇలాంటివి ఏమీ చేయవన్నారు. వైఎస్సార్ పేద, బడుగు, బలహీనవర్గాల ప్రభుత్వమన్నారు. ఓర్వలేకనే ఇటువంటి కుట్ర రాజకీయాలు జరుగుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో కుల, మత, వర్గాల భేదం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు.

కాలువలోకి దూకి వివాహిత బలవన్మరణం


రాజ్యలక్ష్మి మృతదేహం

బల్లికురవ: మతిస్థిమితంలేని వివాహిత సాగర్ కాలువలో దూకి బలవన్మరణం చెందింది. ఈ ఘటన బుధవారం కొప్పరపాలెం సమీపంలోని పసుమర్రు మేజర్ కాలువలో వెలుగులోకి వచ్చింది. బల్లికురవ ఎస్సై వి. వేమన కథనం ప్రకారం.. సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం జంక్షన్‌కు చెందిన సోమిశెట్టి రాజ్యలక్ష్మి (45) భర్త శ్రీనివాసరావు 15 సంవత్సరాల క్రితం చనిపోయాడు. వీరికి పిల్లలు లేరు. 5 నెలలుగా రాజ్యలక్ష్మి మతిస్థిమితం లేక గ్రామంలో అటుఇటూ తిరుగుతూ అద్దంకి బ్రాంచ్ కాలువలోకి ఆత్మహత్య చేసుకుని ఉంటుందని చెప్పారు. శవం బ్రాంచ్ కాలువలో నుంచి పసుమర్రు మేజర్‌లోకి కొట్టుకువచ్చింది. కొప్పరపాలెం గ్రామస్తుల సమాచారం మేరకు కేసు నమోదు చేసి.. రాజ్యలక్ష్మి భౌతిక కాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి వైద్యశాలకు తరలించారు.

నాటు సారా స్వాధీనం



పరారైన వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్న నాటు సారా

చీరాల: అనుమానాస్పదంగా రాత్రి వేళ తిరుగుతున్న వ్యక్తి వద్ద నుంచి 8 లీటర్ల నాటుసారాను ఈపూరుపాలెం రూరల్ ఎస్సై జనార్దన్ స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాత్రి ఈపూరుపాలెం ఐటీఐ కాలేజీ సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులను చూసి అతని చేతిలోని సంచి రోడ్డు పక్కన పడవేసి పరారయ్యాడు. సంచిలో 8 లీటర్ల నాటుసారా గుర్తించారు. పూర్తిస్థాయిలో విచారణ చేయగా వేటపాలెం మండలం రామాపురానికి చెందిన ఆనంద్‌గా నిర్ధారించారు. అతడి కోసం గాలింపు చేపట్టారు.

విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు

- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాలికలకు పరామర్శ


ఏరియా వైద్యశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: గురుకులంలో కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశించారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను బుధవారం రాత్రి ఆయన పరామర్శించారు. ప్రతి విద్యార్థిని ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ ఈ ఘటన దురదృష్టకరమని, అయితే ఒక్క విద్యార్థిని కూడా ఎలాంటి ఇబ్బంది కలగకుండా మెరుగైన వైద్య సేవలను వైద్య బృందం అందించడం జరిగిందన్నారు. ప్రస్తుతం గుంటూరులో ఆరుగురు చికిత్స పొందుతున్నారని, సత్తెనపల్లి వైద్యశాలలో 30 మంది మూడు బ్లాకుల్లో వైద్య సేవలు పొందుతున్నారని పేర్కొన్నారు. అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, విద్యార్థినులు అంతా కోలుకొని సంతోషంగా మాట్లాడుతున్నారని చెప్పారు. ఇప్పటికే 170 మంది కోలుకొని డిశ్చార్జి అయ్యారన్నారు. ఆయనతో పాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాయపాటి పురుషోత్తమరావు, 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ, ధూళిపాళ్ల ది ఆంధ్ర బ్యాంక్ రైతు సేవ సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివన్నారాయణ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి చిలుకా జయపాల్, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ ఈటిపోగు వెంకట్రావు, ఆర్ఎంఓ శోభారాణి ఉన్నారు.

మినీ ట్రక్కు బోల్తా - 25 మందికి గాయాలు

- ఒంగోలు జీజీహెచ్‌కు ముగ్గురు తరలింపు
- అందరూ వ్యవసాయ కూలీలే


బోల్తా కొట్టిన కూలీలు ప్రయాణిస్తున్న మినీ ట్రక్కు

అద్దంకి రూరల్: కూలీలున్న నాలుగు చక్రాల మినీ ట్రక్కు అదుపుతప్పి బోల్తా కొట్టడంతో 25 మందికి గాయాలైన సంఘటన బుధవారం అద్దంకి సమీపంలోని కలవకూరు ఇటుక బట్టీ వద్ద చోటు చేసుకుంది. క్షతగాత్రులు తెలిపిన సమాచారం మేరకు.. మార్టూరు మండలంలోని ద్రోణాదులకు చెందిన 38 మంది కూలీలు ముండ్లమూరు మండలంలోని పూరిమెట్ల గ్రామంలోని పొలాల్లో మిరపపంటను కోసేందుకు బుధవారం ఉదయం వచ్చారు. పని ముగించుకుని సాయంత్రం ఇంటికి వెళుతుండగా అద్దంకి సమీపంలోని కలవకూరు ఇటుక బట్టీల వద్దకు వచ్చేసరికి అకస్మాత్తుగా ఓ బైకు అడ్డు వచ్చింది. దానిని తప్పించే క్రమంలో కూలీలున్న నాలుగు చక్రాల ట్రక్కు బోల్తా కొట్టడంతో అందులోని 25 మందికి గాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్ప గాయలయ్యాయి. స్థానికుల సమాచారంతో అద్దంకి, సంతమాగులూరు 108 వాహనాల ద్వారా క్షతగాత్రులను అద్దంకి వైద్యాశాలకు తరలించారు. ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. సీఐ రోశయ్య సిబ్బందిలో వైద్యశాలకు వచ్చి వివరాలను తెలుసుకున్నారు.

విశ్రాంత టీచరమ్మకు వందనం

పుట్టిన రోజు వేడుకలు

- చిరుప్రాయంలోనే వివాహం..
- మొక్కవోని దీక్షతో టీచర్ ట్రైనింగ్ పూర్తి
- రిటైరయ్యే నాటికి తీసుకున్న జీతం రూ.350!
- ప్రస్తుత పింఛన్ రూ. 20 వేలు!


శతాధిక విశ్రాంత ఉపాధ్యాయురాలు వెంకట సుబ్బమ్మను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు

చుండూరు(భట్టిప్రోలు): శతాధిక విశ్రాంత ఉపాధ్యాయురాలికి కుటుంబ సభ్యులు జన్మదిన వేడుకలు జరిపిన సంఘటన ఇది. చుండూరు మండలం చినపరిమికి చెందిన కొల్లి వెంకట సుబ్బమ్మకు పదేళ్ల చిరు ప్రాయంలోనే అదే గ్రామానికి చెందిన అవుతు రమణారెడ్డితో వివాహం జరిగింది. వివాహమైన కొద్ది రోజులకే భర్త కబడ్డీ ఆడుతూ మరణించారు. ఆమెను గ్రామానికి చెందిన కనకదుర్గ ప్రసాదలింగం ప్రోత్సహించి.. దుగ్గిరాలలో 8వ తరగతి వరకు చదివించారు. 19951లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఆమె వివాహానికి ముందు ఒకటో తరగతి మాత్రమే చదివారు. ఆమె మొక్కవోని దీక్షతో 1951 నుంచి 1953 వరకు నరసాపురంలో టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసి... అదే సంవత్సరం దుగ్గిరాల మండలం మంచికలపూడిలో ఒక ప్రైవేట్ స్కూల్‌లో విద్యాబోధన చేశారు. ఆమెకు అమరావతి మండలం ఎండ్రాయి గ్రామంలో 1955లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి 23 సంవత్సరాల పాటు వివిధ ప్రాంతాల్లో ఉపాధ్యాయురాలిగా పని చేశారు. 1978లో ఆమె రిటైర్‌మెంట్ అయ్యే నాటికి అందుకున్న జీతం రూ.350 కాగా.. ఫింఛన్ రూ. 100తో ప్రారంభమై నేడు రూ. 20 వేలు తీసుకుంటోంది. ఆమె తన సోదరుడు కొల్లి సుబ్బారెడ్డి దగ్గరే ఉంటున్నారు. సుబ్బమ్మ బాగోగులు వారి కుటుంబ సభ్యులు చూసుకుంటున్నారు. కుటుంబ సభ్యులు, సర్పంచ్ మేరుగ సుభాషిణి, ఉప సర్పంచ్ అవుతు సాయిబాబు రెడ్డి, గ్రామ పెద్దల సమక్షంలో బుధవారం ఆమె 100వ రోజు పుట్టినరోజు వేడుకలు జరిపి ఆమెచేత కేక్ కట్ చేయించారు. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు. రిటైర్‌మెంట్ అనంతరం అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల మన్నలను చూరగొన్నారు. ప్రస్తుతం ఆమె తన పనులు తానే చేసుకుంటున్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ పి.వి.జె రామారావు

చీరాల అర్బన్: బాపట్ల జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఈనెల 13, 14 తేదీల్లో చీరాలలోని ఎన్ఆర్ పీఎం హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు డీఈఓ పీవీజే రామారావు అన్నారు. సన్నాహక కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం చీరాలలో ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ పట్ల జిజ్ఞాస పెంచే ఈ ప్రదర్శన విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. 25 మండలాల నుంచి ఎంపిక చేసిన 125 ప్రదర్శనలు కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధం చేయాలని కోరారు. గైడ్ ఉపాధ్యాయులు వారికి దిశా నిర్దేశం చేయాలన్నారు. సమాజంలో ఒక పాఠశాలకు గుర్తింపు తీసుకురావడంలో సైన్స్ ఉపాధ్యాయుల పాత్ర గణనీయంగా పెరిగిందన్నారు. అలానే సైన్స్ పట్ల ఆసక్తి కలిగించే అంశాలపై దృష్టి సారించాలన్నారు. ప్రదర్శనలో లోటుపాట్లు రాకుండా కమిటీలు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈనెల 5న జిల్లా వ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో ఎన్ఎంఎంఎస్ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పర్చూరు ఉపవిద్యాశాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్, ఎంఈఓ డి.నాగేశ్వరరావు, సైన్స్ అధికారి మహమ్మద్ సాధిక్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

తప్పిపోయి.. క్షేమంగా గూటికి చేరాడు!


మేదరమెట్ల పోలీసు స్టేషన్‌లో బాలుడ్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న హెల్ప్ సంస్థ ప్రతినిధులు

మేదరమెట్ల: ఇంటి నుంచి వచ్చిన బాలుడు బైపాస్‌లో తిరుగుతుండగా గమనించిన మేదరమెట్ల పోలీసులు కుటుంబ సభ్యుల వద్దకు చేర్చిన సంఘటన బుధవారం జరిగింది. ఏడుసంవత్సరాల వయస్సు గల బాలుడు మేదరమెట్ల బైపాస్ ప్రాంతంలో తిరుగుతుండటాన్ని గమనించిన ఎస్ఐ శివకుమార్ వివరాలు రాబట్టే యత్నం చేయగా.. తన వివరాలను చెప్పలేని పరిస్థితిలో ఉన్నాడు. దీంతో హెల్ప్ సంస్థ డైరెక్టర్ బీవీ సాగర్‌కు సమాచారాన్ని అందచేశారు. అక్కడకు చేరుకున్న హెల్ప్ సంస్థ ప్రతినిధులు బాలుడు.. సింగరాయకొండలోని బాపిస్టు చర్చి రెండో లైను అని తెలుసుకున్నారు. తల్లిదండ్రులు చిన్నవయస్సులోనే చనిపోగా తాత వద్ద ఉంటూ భిక్షాటన చేస్తుంటాడని గుర్తించారు. స్థానిక పోలీసుల సాయంతో సింగరాయకొండలోని బంధువులకు సమాచారం ఇవ్వగా వారు మేదరమెట్ల పోలీసు స్టేషన్‌కు వచ్చి బాలుడ్ని తీసుకెళ్లినట్లు ఎస్సై తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా బాల సంక్షేమ కమిటీ అధికారులకు తెలియపరచి వీలైనంత త్వరగా బాలుడ్ని బాలల హోమ్‌లో చేరిృంచేందుకు చర్యలు తీసుకుంటానని డైరెక్టర్ సాగర్ తెలిపారు.

రాజీ చర్చల్లో బాహాబాహీ

- మత్స్యకారుల సమావేశంలో ఘటన
- సమావేశాన్ని అర్ధంతరంగా ముగించిన అధికారులు


మత్స్యకారులతో చర్చిస్తున్న తహసీల్దార్, మత్స్యశాఖ అధికారులు

కొల్లూరు: చేపల వేటకు ఉపయోగించే వలల విషయంలో మత్స్యకారుల మధ్య జరుగుతున్న వివాదాలను పరిష్కరించేందుకు అధికారులు నిర్వహించిన చర్చల్లో ఇరు వర్గాల మత్స్యకారులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ బాహాబాహీకి దిగారు. మంగళవారం పోతార్లంక వద్ద కృష్ణా నదిలో వలల విషయంలో పోతార్లంక- గాజుల్లంక గ్రామాలకు చెందిన మత్స్యకారుల నడుమ వివాదం జరగడంతో సమస్యను పరిష్కరించేందుకు అధికారులు బుధవారం రాత్రి కొల్లూరు రెవెన్యూ కార్యాలయంలో ఇరు గ్రామాలకు చెందిన మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. మత్స్యశాఖ ఏడీ పి.గాలిదేముడు, కూచిపూడి మత్స్యశాఖ డీఓ జె.హిమజ, కొల్లూరు తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావులు మత్స్యకారులతో ప్రభుత్వం నిషేధించిన వలల విషయంపై చర్చిస్తున్న సమయంలో ఇరు వర్గాల నడుమ మాటామాటా పెరిగి వివాదానికి దారితీసింది. గతంలో మత్స్యకారుల మధ్య జరిగిన ఒప్పందాలను అతిక్రమించి చేపల వేటకు వలలు వినియోగించరాదని అధికారుల సూచించడంతో రెండు గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో వివాదం మొదలైంది. దీంతో అధికారులు అర్ధంతరంగా సమావేశాన్ని నిలిపివేశారు. మత్స్యకారులను శాంతింపజేసేందుకు అధికారులు ప్రయత్నించినప్పటికీ రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలోనే బాహాబాహీకి దిగడంతో తోపులాట చోటుచేసుకుంది. మత్స్యకారుల నడుమ సామరస్య చర్చల ద్వారా సమస్యను పరిష్కరించేందుకు పూనుకున్న అధికారులు ఇరువురు ఒకరిపై ఒకరు తలపడుతుండటంతో సమావేశాన్ని నిలిపివేశారు.

పలు రైళ్లు తాత్కాలిక రద్దు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని న్యూ గుంటూరు- నంబూరు స్టేషన్ల పరిధిలోని రైల్వే పనులు చేపడుతున్న నేపథ్యంలో పలు రైళ్లు తాత్కాలిక, పాక్షిక రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం ఆంజనేయులు బుధవారం తెలిపారు. రైలు నంబర్ 07464 విజయవాడ-గుంటూరు, 07465 గుంటూరు-విజయవాడ, 07628 విజయవాడ-గుంటూరు, 07786 గుంటూరు-రేపల్లె రైలు ఈనెల 1,4,5వ తేదీలలో తాత్కాలిక రద్దు చేసినట్లు వివరించారు. అదే విధంగా రైలు నెంబర్ 17282 నరసరావుపేట- గుంటూరు రైలు ఈనెల 4,5వ తేదీలలో వయా తెనాలి మీదుగా మళ్లించినట్లు చెప్పారు.